గోదావరి మహోగ్ర రూపం



పెరవలి మండలం మల్లేశ్వరం వద్ద గోదావరి ముంపులో ఉన్న లంక పంటలు

- నిండా మునిగిన లంక పంటలు
- ఆశలు వదులుకున్న రైతులు
- పశువులకు గూడు, దాణా కరవు

పెరవలి: వశిష్ట గోదావరి మహోగ్ర రూపం దాల్చింది. మండలంలోని లంక పంటలన్నీ నీటిలోనే ఉన్నాయి. పశువులకు గూడు కరవైంది. మండలంలోని కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, ముక్కామల, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల లంక భూముల్లోని సుమారు మూడు వేల ఎకరాల్లోని పంటలు ఐదు రోజులుగా జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. దాంతో రైతులు ఆశలు ఆవిరయ్యాయి. గోదావరి తగ్గుతుందని, కొద్దిపాటి పంటైనా దక్కుతుందని అన్నదాతలు ఆశ పడ్డారు. ఊహించని విధంగా ఆది, సోమవారాల్లో గోదావరి మరింతగా పెరగడంతో వారి ఆశలు అడియాసలయ్యాయి. ఈ లంకల్లో సాగవుతున్న కొబ్బరి, అరటి, కంద, కోకో, తమలపాకులతో పాటు వంగ, బెండ, బీర, ఆనప, చిక్కుడు, క్యాబేజీ, దొండ వంటి కూరగాయలు, పచ్చిమిరప తోటలు, ఆకుకూరలైన గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, మెంతికూర వంటివి సాగవుతున్నాయి. వాటితో పూల తోటలైన బంతి, చామంతి, గులాబీ, మల్లె, లిల్లీ తోటలు పూర్తిగా మునిగిపోయాయి. వరద కమ్మేసిన లంక భూముల్లోని అరటి తోటల్లోకి రైతులు అద్దెకు తెచ్చిన పడవలపై వెళ్లి గెలలు కోసి తెస్తున్నారు. రోజుల తరబడి అరటి తోటలు నీట మునిగి ఉండడంతో గెలలు ముగ్గిపోతున్నాయని రైతులు తెలిపారు. ఈ గెలలను మార్కెట్‌కు తీసుకెళ్లిలా గిట్టుబాటు ధర లభించదని చెబుతున్నారు. మరోపక్క వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన కంద మొదళ్లతో సహా లేచి పోవడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. లంకల్లో నిల్వ ఉన్న కొబ్బరి, గుమ్మడి కాయలను కూడా రైతులు పడవల్లో ఒడ్డుకు తీసుకు వస్తున్నారు. ముంపు ఎప్పుడు తగ్గుతుందా అని ఎదురు చూస్తున్నారు.

ముంపులో 9,320 ఎకరాల్లోని పంటలు

కొవ్వూరు: భారీవర్షాలు, గోదావరి వరద ప్రభావంతో కొవ్వూరు డివిజన్‌లో 9,320.4 ఎకరాల్లోని వ్యవసాయ పంటలు ముంపు బారిన పడ్డాయి. గత ఎనిమిది రోజులుగా పంటలన్నీ ముంపులోనే ఉన్నాయి. రెండు రోజుల క్రితం వరద కాస్తా నెమ్మదిస్తుందని భావించిన తరుణంలో మళ్లీ గోదావరికి వరద పోటెత్తింది. దీంతో లంక భూములు మళ్లీ నీట మునిగాయి. మరోవైపు వర్షాల తగ్గడం, ఎర్ర కాలువకు ఎగువ నుంచి వచ్చే వరద తగ్గుముఖం పట్టడంతో పంటలు తేరుకుంటున్నాయి. మండలాలవారీగా కొవ్వూరులో 412.5,చాగల్లులో 125, దేవరపల్లిలో 900, గోపాలపురంలో 550, తాళ్లపూడిలో 606.5 ,నిడదవోలులో గరిష్ఠంగా 3,412.4, ఉండ్రాజవరంలో 2,500, పెరవలిలో 386, నల్లజర్లలో 428 ఎకరాల్లో వ్యవసాయ పంటలు ముంపులో ఉన్నట్టు అధికారులు సోమవారం ప్రాథమికంగా గుర్తించారు. అలాగే డివిజన్ వ్యాప్తంగా ఉద్యాన పంటలు సుమారు 800 ఎకరాల వరకూ ముంపు బారిన పడ్డాయి.



కొవ్వూరు మండలం కాపవరం సమీపంలో వరద ముంపులో ఉన్న పంట పొలాలు

ముంపులో గోష్పాద క్షేత్రం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రం ఇంకా వరద ముంపులోనే ఉంది. ఎగువ నుంచి వస్తున్న వరద కాస్త నెమ్మదించినప్పటికీ కొవ్వూరులో మాత్రం వరద ఉధృతి కొనసాగుతోంది. క్రమంగా క్షేత్రంలో వరద నీరు తగ్గుతోంది. ఇప్పటికీ ఇక్కడ రెండు అడుగులకు పైగా నీరు ప్రవహిస్తోంది. వరద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు గోష్పాద క్షేత్రంలోకి ఎవరినీ అనుమతించడం లేదు. గోదావరి రేవులో ఎవరూ స్నానాలకు దిగకుండా పోలీసు, రెవెన్యూ శాఖల సిబ్బంది క్షేత్రం వద్ద కాపలా కాస్తున్నారు. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. సోమవారం రాత్రికి రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొవ్వూరు డివిజన్‌లోని తాళ్లపూడి, కొవ్వూరు, పెరవలి, నిడదవోలు మండలాల్లోని లంక భూముల్లోని పంటలు ముంపు నుంచి తేరుకునేందుకు మరికొంత సమయం పడుతుంది. వారం రోజుల వ్యవధిలోనే రెండు సార్లు వరద ముంచెత్తడంతో పంటలకు నష్ట తీవ్రత అధికంగా ఉందని రైతులు వాపోతున్నారు. మంగళవారం సాయంత్రానికి వరద సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

వరద తగ్గుముఖం

తాళ్లపూడి: మండలంలో గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. సోమవారం గోదావరిలో వరద లంకలను అనుకుని ప్రవహించింది. గోదావరి రేవులన్నీ కూడా ముంపులోనే ఉన్నాయి. తాళ్లపూడి, వేగేశ్వరపురంలోని లంకల్లో సాగు చేస్తున్న బెండ, వంగ, అరటి తోటలు రెండు సార్లు ముంపు బారిన పడడంతో ఈ పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు చెబుతున్నారు.



తీపర్రు వద్ద లంకల్లోని గుమ్మడి కాయలను పడవలో ఒడ్డుకు తెస్తున్న రైతులు



ముక్కామల వద్ద పొలంలో నీట మునిగిన షెడ్డు



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ఆలయాలను ముంచెత్తిన వరద



తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం వద్ద ముంపులో ఉన్న లంక పంటలు

క్లుప్తంగా

శాకంబరీ నమోస్తుతే..



శాకంబరిగా వాసవీ కన్యకాపరమేశ్వరి

ఉండ్రాజవరం: ఆషాఢ మాసం సందర్భంగా ఉండ్రాజవరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు సోమవారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, నిమ్మకాయలు, ఆకుకూరలు, పండ్లతో సుందరంగా అలంకరించారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత



విద్యార్థినులకు యూనిఫాం అందజేస్తున్న యాదవోలు సర్పంచ్ వరప్రసాద్

దేవరపల్లి: ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాంను సోమవారం యాదవోలు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఆ పంచాయతీ సర్పంచ్ సున్నం వరప్రసాద్ అందజేశారు. పాఠశాలలోని 336 మంది విద్యార్థులకు రెండేసి జతల చొప్పున యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణ, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ షేక్ ముస్తఫా, ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి టీచర్ల ఆర్థిక సాయం



విద్యార్థి మందపాటి రవి నాగదుర్గారావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీచర్లు

నల్లజర్ల: మంచి మార్కులతో ఈ ఏడాదే టెన్త్ పాసైన దూబచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మందపాటి రవి నాగదుర్గారావు కుటుంబ పరిస్థితుల వల్ల చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. లారీ డ్రైవర్ అయిన అతడి తండ్రి గత నెలలో శ్రీకాకుళంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లూ విరిగిపోయి మంచాన పడ్డాడు. తండ్రి వైద్య ఖర్చులకే ఇబ్బంది పడుతున్న రవి కాలేజి చదువు ప్రశ్నార్థకంగా మారింది. అతడి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న ఉపాధ్యాయుడు బొందల శ్రీనివాస్ తోటి ఉపాధ్యాయులకు మాట్లాడి ఆ కుటుంబానికి అండగా నిలిచాడు. వారంతా స్పందించి రూ.20 వేలు సమకూర్చారు. రవి తండ్రి వైద్య ఖర్చులకు రూ.10 వేలు, రవి కాలేజీ ఫీజుల నిమిత్తం మరో రూ.10 వేలను దూబచర్ల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుమతి చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాలతీపద్మ, దీప్తి, భీమా, కౌండిన్య, సతీష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంజీవపురంలో రామానంద భారతి వర్ధంతి

నల్లజర్ల: అనంతపల్లి శివారు సంజీవపురంలోని స్వర్ణ దుర్గాశ్రమ వ్యవస్థాపక పీఠాధిపతి స్వామి రామానంద భారతి 9వ వర్ధంతిని సోమవారం భక్తులు నిర్వహించారు. రావిమెట్ల స్వామీజీ నారాయణ భారతీస్వామి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతం, పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వర్ణదుర్గాంబకు కుంకుమ పూజలు చేశారు. అద్దంకి కృష్ణమోహన్, స్వరూపరాణి దంపతులచే పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రసన్న విఘ్నేశ్వర భజనమండలి ఆధ్వర్యంలో భజన చేశారు. ఈ సందర్భంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

గొడుగుల పంపిణీ

ఉండ్రాజవరం: తాడిపర్రు నంబర్–2 ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం గొడుగులు పంపిణీ చేశారు. పాలంగి నంబర్–2 పాఠశాల హెచ్‌ఎం టి.పరమపావని ఆర్థిక సహకారంతో వాటిని పంపిణీ చేశారు.

పాడైన గుడ్ల వ్యవహారంలో ఇద్దరికి చార్జి మెమోలు

తాళ్లపూడి: కుళ్లిన కోడిగుడ్ల సరఫరా వ్యవహారంలో తాళ్లపూడి బీసీ కాలనీలోని 96వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త తెరిసమ్మకు, ఐసీడీఎస్ తాళ్లపూడి సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యకుమారికి చార్జి మెమోలు జారీ చేసినట్టు సీడీపీవో మమ్మీ సోమవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన కోడిగుడ్ల సరఫరా చేసిన వ్యవహారం రెండు రోజుల క్రితం మండలంలోని అన్నదేవరపేటలో వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఈ ఉదంతంపై అధికారులు విచారణ జరిపిన అనంతరం ఈ మేరకు చర్యలు తీసుకున్నట్టు సీడీపీవో చెప్పారు. కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్‌ను కూడా ప్రశ్నించామన్నారు. దీనిపై కాంట్రాక్టర్ సతీష్ వివరణ ఇస్తూ తాము సరఫరా చేసిన గుడ్లలో పాడైనవి ఉంటే వాటి స్థానంలో మంచి గుడ్లు అందిస్తామన్నారు. అన్నదేవరపేటలో ఫిర్యాదు వచ్చిన రోజే 600 గుడ్లు పాఠశాలల్లోను, అంగన్‌వాడీ కేంద్రంలోను అందించినట్టు తెలిపారు.

ప్రారంభమైన పంట నష్టం నమోదు



కొవ్వాడ కాలువ వరద ముంపునకు దెబ్బతిన్న వరి చేలను నమోదు చేస్తున్న ఏవో విజయ్, సిబ్బంది



దేవరపల్లి మండలంలో కొవ్వాడ వరద ముంపులో కుళ్లిపోయిన వరి పంట

మండలంలో 900 ఎకరాల్లో వరికి నష్టం

దేవరపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురై దెబ్బతిన్న వరి పంట నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ప్రభుత్వాదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది గామాల్లో పొలాలకు వెళ్లి పూర్తిగా దెబ్బతిన్న పంట చేలను పరిశీలించి నమోదు చేస్తున్నారు. ప్రధానంగా దేవరపల్లి మండలంలో కొవ్వాడ కాలువ ముంపుతో గౌరీపట్నం గ్రామంలో ఇప్పటి వరకూ 345 ఎకరాల వరి చేలు దెబ్బతిన్నట్టు అధికారులు నమోదు చేశారు. ఎర్ర కాలువ వరద ముంపునకు త్యాజంపూడి, కురుకూరు గ్రామాల్లో 300 ఎకరాల్లోని వరి చేలు దెబ్బతిన్నట్టు ఏవో కె.విజయ్ తెలిపారు. మండలంలో భారీ వర్షాలకు సుమారు 900 ఎకరాల్లో వరి చేలు పూర్తిగా దెబ్బతిన్నట్టు వివరించారు. దెబ్బతిన్న పంటలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. ఎక్కువ రోజులు వరి చేలు నీట మునిగి ఉండడం వల్ల మూనలు కుళ్లిపోయాయని వివరించారు. ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువ ప్రాంతాల్లో వరద నీరు పూర్తిగా తగ్గిందని ఏవో విజయ్ తెలిపారు.

పట్టణంలో 20 తాగునీటి శాంపిల్స్ సేకరణ

సాక్షి ఇంపాక్ట్

కొవ్వూరు: మున్సిపాలిటీ పరిధిలో పౌరులకు కలుషిత తాగునీరు సరఫరా అవుతున్న అంశంపై కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ స్పందించారు. తక్షణమే నివారణ చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసెఫ్‌కు ఫోన్‌లో ఆదేశించారు. 'కొవ్వూరులో తాగునీరు కలుషితం' అన్న శీర్షికతో సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు మునిసిపల్ ఏఈ కె.సుమంత్, ఇతర టెక్నికల్ సిబ్బంది పట్టణంలో తాగునీరు కలుషితంగా సరఫరా అవుతున్న ప్రాంతాల్లో సోమవారం 20 శాంపిల్స్ సేకరించారు. వాటిని పరీక్షల నిమిత్తం పంపినట్టు ఏఈ తెలిపారు. ఎక్కువగా క్లోరినేషన్ చేయడం వల్ల తాగునీరు రంగు మారిందని చెబుతున్నారు. పైప్‌లైన్ లీకేజీలున్నాయా? అన్న కోణంలోనూ పరిశీలిస్తున్నట్టు తెలిపారు.



కొవ్వూరు మెరక వీధిలో తాగునీటి సమూనాలు సేకరిస్తున్న మున్సిపల్ ఏఈ సుమంత్ తదితరులు

జీతాల బకాయిలు చెల్లించాలంటూ నిరసన

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు మద్దతు

కొవ్వూరు: ప్రకృతి వ్యవసాయ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులకు బకాయి పడిన 13 నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు ఏర్పాటు చేసి విక్రయిస్తున్న కూరగాయల దుకాణం వద్ద సోమవారం ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులను సుందర్‌బాబు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ రైతు సాధికార సంస్థలో పని చేస్తున్న సుమారు 300 మంది ఉద్యోగులకు 13 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. పురుగు మందుల అవశేషాలు లేకుండా పంటలు పండించేలా రైతులకు అవగాహన కల్పించడంలో చిరుద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 50 లక్షల ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిన ప్పటికీ ఈ శాఖలో పనిచేసే ఉద్యోగులకు జీతాలు చెల్లించపోవడం బాధాకరం అన్నారు.

నకారాకు ఎమ్మెల్యే మద్దిపాటి నివాళి

నల్లజర్ల: ఉద్యోగుల పెన్షన్‌ను పోరాడి సాధించిన డీఎస్ నకారా వర్ధంతిని సోమవారం స్థానిక వేణుగోపాలస్వామి కల్యాణ మండపంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఐవీ సత్యం అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగంలో ప్రకాశరావుపాలెంలో బాల్యంలో తనకు విద్యాబుద్ధులు నేర్పించిన బాలయ్య, కామేశ్వరరావు, ఫెర్నాండ్‌రాజు, చెక్కా సూర్య ప్రభాదేవి టీచర్ల సేవలను గుర్తు చేసుకున్నారు. త్వరలో నియోజకవర్గ స్థాయిలో నిర్మించబోయే ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయంలో ప్రతినెలా విశ్రాంత ఉద్యోగులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు హాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు ఎమ్మెల్యే మద్దిపాటిని సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కొఠారు అనంత లక్ష్మి, కూచిపూడి ఉదయ భాస్కరావు,చెల్లు సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నల్లజర్లలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును సత్కరిస్తున్న రిటైర్డ్ ప్రభుత్వోద్యోగులు

160 మంది విద్యార్థులకు బస్ పాస్‌లు

నల్లజర్ల: పోతవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 160 మందికి సోమవారం బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఇందుకయ్యే ఖర్చును పోతవరం సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు సమకూర్చినట్టు ప్రధానోపాధ్యాయుడు గోపి గోవర్ధన్ చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన తాడేపల్లిగూడెం బస్ డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పాపా నాగేశ్వరరావు, ఆర్టీసీ పీఆర్వో విజయకుమార్, బస్ పాస్ జారీ ఇన్‌చార్జ్, ఉపాధ్యాయుడు సత్యనారాయణ, రమేష్ నాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిడదవోలు: సమస్యలను పరిష్కరించే వరకూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమష్టిగా పోరాడాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు సూచించారు. మున్సిపల్ వర్కర్స్ ఆధ్వర్యంలో సీఐటీయూ పతాకాన్ని సోమవారం పారిశుధ్య కార్మికులు ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాంబాబు మాట్లాడుతూ నిడదవోలు మున్సిపాలిటీలో చాలినంత మంది పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో పనిభారం ఎక్కువై కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. సిబ్బందికి పారిశుధ్య పనిముట్లు కూడా అందించడం లేదని రాంబాబు విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ రాంభూపాల్ రెడ్డి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బౌరిశెట్టి కొండ, తూరుగోపు చిరంజీవి, బొచ్చా సాయిరమణ, రమేష్, అప్పారావు, నాగలక్ష్మి, కాకి రాజు, గణేష్, పద్మ, అనూష, భవాని, బ్రహ్మం, అభిమన్యుడు, రాణి తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పారిశుధ్య కార్మికులు

పాఠశాలల్లో శుభదిన్ తిథి భోజనం

చాగల్లు: శిక్షా సప్తాహ్ విద్యా వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ ప్రాథమిక (జేఆర్‌బీ) పాఠశాలలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. దాతలు పట్టపు సుబ్రహ్మణ్యం (చిన్న), సత్యవతి దంపతులు 37 మంది విద్యార్థులకు, 13 మంది తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు, 10 మంది అంగన్‌వాడీ విద్యార్థులకు శుభదిన్ తిథి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఇంటి శేఖర్, గ్రామపెద్దలు గంగ్రోతు సూర్యనారాయణ, ఇంటి వీర్రాజు, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పోలిశెట్టి శ్రీను, జనసేన నాయకులు ఇంటి వీరబాబు, మిరియాల సతీష్ బాబు పాల్గొన్నారు.



చాగల్లులో విద్యార్థులకు భోజనం అందిస్తున్న దృశ్యం

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: శిక్షా సప్తాహ్ విద్యా వారోత్సవాల్లో భాగంగా సోమవారం పలు పాఠశాలల్లో శుభదిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. దాతల సాయంతో పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అదనంగా స్వీట్లు, ఇతర ఆహార పదార్థాలు అందజేశారు. వేగేశ్వరపురానికి చెందిన బాదరాల వెంకటేశ్వరరావు జన్మదినం సందర్భంగా ఆ గ్రామంలోని మండల పరిషత్ జూనియర్ బేసిక్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 50 మందికి స్వీటు, కేకు, బిర్యానీ, చికెన్, పెరుగుతో ప్రత్యేక భోజనం అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. రాగోలపల్లి ప్రాథమిక పాఠశాల్లో హెచ్‌ఎం దుర్గారావు దంపతులు విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

నల్లజర్ల మండలంలో..

నల్లజర్ల: పోతవరం హైస్కూల్ విద్యార్థులు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు కేడీవీడీ ప్రసాద్ మూడు గెలలు అరటి పండ్లు అందించారు. ప్రాథమిక పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సోదిమళ్ల ఏడుకొండలు విద్యార్థులకు స్వీట్లు పండ్లు, పెరుగు అందించినట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం పావని తెలిపారు. అచ్చన్నపాలెం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆండుగుల వెంకటేశ్వరరావు అనే దాత స్వీట్లు అందజేశారు.హెచ్‌ఎం గోపి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే గోదావరి చైతన్య విద్యా వికాస్ సొసైటీ అన్ని పాఠశాలల విద్యార్థులకూ స్వీట్స్, విజిటబుల్ బిర్యానీ, బంగాళాదుంప కూర అందజేసింది.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు: పట్టణంలోని ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఎకనామిక్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి తెలిపారు. ఈ పోస్టుకు ఎకనామిక్స్‌లో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై, నెట్, స్లెట్, సెట్ అర్హత గల వారికి ప్రాధాన్యం ఉంటుంది. అర్హత గల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాను ఆగస్టు 3వ తేదీ లోగా కళాశాలలో అందజేయాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: ప్రభుత్వం సమకూర్చిన ఉచిత పాఠ్య పుస్తకాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ముందుగా ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడి కళాశాలలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి, దాయిన రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, నామన పరమేశ్వరరావు, బొండాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు వీఓఏల మండల నూతన అధ్యక్షురాలిగా సత్యవతి



నూతన కమిటీ సభ్యులు

నిడదవోలు: మండలంలోని వెలుగు వీఓఏల నూతన కమిటీ (సీఐటీయూ)ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మందపాటి సత్యవతి, గౌరవాధ్యక్షుడిగా జువ్వల రాంబాబు, ఉపాధ్యక్షురాలిగా ఏలూరి అనురాధ, కార్యదర్శిగా గెద్దాడ రజిత, సహాయ కార్యదర్శిగా దొడ్ల సురేఖ, కోశాధికారిగా గుండుమెల్లి వరలక్ష్మి, సభ్యులుగా సత్య రాధ, బాధనాల రత్నకుమారి, గొట్టిపాటి విజయ, పోతన చిన్నరత్నకుమారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ వెలుగు వీవోఏలు 18 ఏళ్లుగా పని చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లి అమలుకు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. చాలీచాలని ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్న వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

డ్రైన్లలో పూడిక తీతకు రూ.32 లక్షలు

నిడదవోలు: పట్టణంలో మురికివాడల్లోని డ్రైన్లలో పూడికతీత పనులకు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ కింద రూ.32 లక్షలు మంజూరు చేసిందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ సోమవారం తెలిపారు. పట్టణంలోని పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఆయన చెప్పారు. పట్టణంలోని ప్రతి వార్డులోని డ్రైన్లలోనూ పూడికతీత పనులు చేపడతామన్నారు. పట్టణంలో నాలుగు కిలోమీటర్ల మేర మేజర్ డ్రైన్లు, 10 కిలో మీటర్ల మేర మీడియం డ్రైన్లు ఉన్నాయన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఇప్పటికే అధికారులను ఆయన ఆదేశించారు.